


ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 7 సంచిక : 13 పుష్పం : 34-36 20-03-2002

**RAMANA BHASKARA**
**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**
PAGES : 16

**VOL : 7** **ISSUE : 13**

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

**ADDRESS**
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 22438, 24278


## జీవిత గమ్యం

గాఢనిద్రలో మనం ఆనందంలోనే వుంటున్నాం, జాగ్రదవస్థలో కూడా మనం ఆనందంలోనే ఉన్నాం కాని తాదాత్మ్య దోషం వల్ల అనగా మూలతలంపు దేహంతో తాదాత్మ్యం చెందటం వల్ల ఆనందానికి దూరమవుతున్నాం. అహంకారం తొలగితే ఆనందం అక్కడేవుంది. దానిని వెతుక్కుంటూ ఎక్కడికో పోనవసరంలేదు. మరి అహంకారం తొలగడం ఎలాగన్నది ప్రశ్న. దానికి నిత్యం 'నేనెవరు'? అని విచారణ చేసుకుంటూ, మూలతలంపు యొక్క మూలం లోనికి వెళ్ళాలి. విషయవాసనలు దూరమయ్యే వరకు ఈవిచారణ అవసరము. ఈవిచారణ జాగరూకతతో, సమగ్రంగా, నిరంతరం జరగాలి. ప్రత్యక్షానుభూతిని పొందేవరకు ఈవిచారణ చెయ్యాలి. 'నేను అను మూలతలంపు' దాని పుట్టుక స్థానమైన హృదయము నందు నశించగా 'నిజమైన-నేను' తానుగా, సచ్చిదానంద స్వరూపముగా అనుభవంలోనికి వస్తుంది. అహంకారం సమూలంగా నశించడానికి మరియొక పద్ధతి 'శరణాగతి', శరణాగతి అనగా వ్యక్తి భావనను విడిచిపెట్టి పరిపూర్ణంగా ఈశ్వరుని ఇచ్ఛకు కట్టుబడి యుండుట. ఈశ్వరుని సంకల్పమే నాసంకల్పం, ఆయన ఇష్టమే నాఇష్టం, అనెడి ధృడవిశ్వాసం కలిగియుండాలి. అహంకారాన్ని దాని పుట్టుకస్థానమైన హృదయంలో నశింపజేయుటయే నిజమైన శరణాగతి. దేహాత్మబుద్ధిని వదల్చుకోవడమే నిజమైన శరణాగతి. ఇతరచింతలు లేకుండా నిరంతరము ఆత్మచింతనలో నుండుటయే నిజమైన శరణాగతి. విచారణాపద్ధతి ద్వారా గాని, శరణాగతి ద్వారాకాని మూలతలంపు మూలంలోనికి వెళ్ళవచ్చును. తన నిజస్వరూపాన్ని తాను అనుభవంలోనికి తెచ్చుకొనుటయే మోక్షం. తానుగా జీవించుటయే మోక్షం. నేను ఎవరో? నా నిజస్వరూపము ఏమిటో, నాకు అనుభవంలోనికి రానప్పుడు, మిగిలినవి ఎన్ని తెలిసినా అవి స్వప్నసమానము. శరీరానికి మరణం రాకమునుపే హృదయంలోనున్న సత్యవస్తువును స్వరూపంగా అనుభవంలోనికి తెచ్చుకొనుటయే మన జీవితగమ్యం.

చావలి సూర్యనారాయణమూర్తి
టీచర్, అమలాపురం

ఈ సంచికలో...... **సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు**


07-02-2002 చిలకలపూడి ........ 3
19-02-2002 గణపవరం ........ 8
23-02-2002 చించినాడ ........ 14



Visit us: www.srinannagaru.com

రమణభాస్కర

(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 7-2-02, చిలకలపూడి)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతుడికి అసలు రూపం ఉందా అంటే రూపంలేదు. ఆయన రూపం లేకుండా ఉండగలడు, రూపంతో ఉండగలడు. మన మనస్సులో ఉన్న దోషాలవలన, మనలోఉన్న స్వార్ధంవలన రూపం విలువ, నామంవిలువ మనకు తెలియటంలేదు. ఈ ప్రపంచరూపంలో ఉన్నవాడు భగవంతుడే. ధనవంతులకు దేవుడుకావాలి, దరిద్రులకు దేవుడుకావాలి, చదువుకొన్నవారికి దేవుడుకావాలి, చదువులేనివారికి దేవుడు కావాలి, ఆరోగ్యవంతుడికి దేవుడు కావాలి అనారోగ్యవంతుడికి దేవుడు కావాలి, పురుషులకు దేవుడుకావాలి, స్త్రీలకు దేవుడు కావాలి, సమస్త జీవకోటికి దేవుడు కావాలి. కాని దేవుడి విలువ మనకు తెలియటంలేదు. దేవుడు నిజమైన ఆత్మగా ఉన్నాడు. ప్రపంచరూపంలో, ఈ సృష్టిరూపంలో ఉన్నవాడు ఈశ్వరుడే. మనం లేకుండా ఆయన ఉండగలడు కాని ఆయన లేకుండా మనం ఉండలేము. అయితే మనకు ఉండవలసినంత భక్తిలేదు. మనకు కొంచం భక్తి ఉంటే అది కారణభక్తి ఉందిగాని అకారణభక్తిలేదు. మనకు దేవుడి మీద ప్రేమ ఉండాలి, భక్తి ఉండాలి కాని కారణం కనబడకూడదు. ఆయన మీద మనకు సజీవమైన విశ్వాసం ఉండాలి. మనకు స్థిరచిత్తం ఉండాలి. మన హృదయంలో దేవుడు ఉన్నాడు. కాని ఆయన మనకు తెలియకపోవటానికి మనస్వార్ధమే కారణం, మనదేహమేకారణం. ప్రతీమనిషి దేహాన్ని కేంద్రంగా పెట్టుకొని జీవిస్తాడు. ఈదేహము నీవుకాదు, మనస్సు నీవుకాదు. అందువలన ఇది కాదు, ఇది కాదు అనిగెంటుకొంటూ గెంటుకొంటూవెళ్ళి ఎక్కడయితే ఈశ్వరుడు ఉన్నాడో, రూపానికి అరూపానికి అతీతమైన ప్రభువు ఎక్కడైతే ఉన్నాడో అక్కడకు చేరుకో. అది నీ స్వస్థానం. నీ స్వస్థానం చేరినప్పుడు నీకు స్వస్థితి కలుగుతుంది. మనకు భక్తిలేదు, వినయంలేదు. మనకు జ్ఞానం వచ్చేసింది అనుకోవటం. ఇలా మనలను మనం మోసంచేసుకోవటం. మనలను మనం మోసంచేసుకొంటే మనంఎలా బాగుపడతాము. మనకు ఎంతవరకు భక్తిఉంది, వినయంఉంది, మనస్సులో ఎంతవరకు నిదానం ఉంది అని ఏమీపటించుకోవటంలేదు. ఏదో ఆ పుస్తకం, ఈ పుస్తకం చదివితే ఏముంది?. పుస్తకాలలో దేవుడులేడు, దేవుడు నీహృదయంలోనే వున్నాడు. భగవంతుని నామాన్ని స్మరించిగా మనం పవిత్రులం అవుతాము. నామంవేరు, బ్రహ్మంవేరుకాదు. నామం చేయగాచేయగా చేసే మనస్సు నశిస్తుంది. మనస్సు





నశించిన వెంటనే బ్రహ్మం నీకు వ్యక్తమవుతుంది. పూజలు, జపాలు, ధ్యానాలు ఈసాధనలు అన్ని కూడా మనోనాశనానికి ఉద్దేశించినవే.

ధ్యానం ఎలా చేయాలి అనిఅడుగుతున్నారు. ఒకే వస్తువు మీద నీమనస్సును నిలబెట్టి ఉంచితే అదిధ్యానం. ఒకే వస్తువుమీద నీ మనస్సును నిలబెట్టి ఉంచటంవలన అది నశిస్తుంది. మనస్సు నశిస్తే నీవు ఎవరో నీకు తెలుస్తుంది. భగవంతుడి రూపం ఏమిటి అంటే ఈప్రపంచమే ఆయన రూపం. అయితే ప్రపంచం అంతా దేవుడిగా మనం చూడలేకపోతున్నాము. అందువలన దేవాలయాలు కట్టించి, దేవుడికి ఒకరూపం పెట్టి అక్కడ ప్రతిష్టించారు. భగవంతుడు మనహృదయంలోనే ఉన్నాడు. రాగద్వేషరహితుడు, కామక్రోధరహితుడు వాడి హృదయంలోనే దేవుడిని చూస్తాడు. వాడి హృదయంలోనే దేవుడిని చూసినవాడు ఇతరుల హృదయాలలో కూడ దేవుడిని చూడగలడు. అందుచేత ప్రతీమనిషి ముందు తనను తాను సంస్కరించుకోవటానికి ప్రయత్నం చేయాలి. మీకు భగవంతుడిమీద నిజంగా గౌరవం ఉంది అనుకోండి, ఆయన మీద లోపల మీకు విశ్వాసం ఉంది అనుకోండి, ఆయన చెప్పినట్లుగా జీవిస్తూ ఆయనలో ఐక్యం అవ్వాలి అనే తపన మీకు ఉంది అనుకోండి, దాని గురించి మీరు పూజలు జపాలు ధ్యానాలు చేస్తున్నారు అనుకోండి మీరు భగవంతుడిని ఎంత గౌరవిస్తున్నారో, అప్పడు సమాజం కూడా మిమ్మల్ని అంతగౌరవిస్తుంది. మేము ఎక్కడికి వెళ్ళినా మమ్మల్ని గౌరవించటానికి కారణం ఈశ్వరుడి మీద మాకు ఉన్న భక్తి, ఆయన ఉన్నాడనే కృతనిశ్చయం. ఈశ్వరుడు మీద పరిపూర్ణ విశ్వాసం ఉంటే అసలు మనస్సుకు చాపల్యం ఉండనేఉండదు. జ్ఞానమార్గంలోకంటే భక్తిమార్గంలో ఎక్కువ విశ్వాసం ఉండాలి. విశ్వాసహీనుడికి భక్తిమార్గం పనిచేయదు.

మనకు మోక్షంపట్ల ఆపేక్షలేదు, భోగంపట్ల ఆపేక్షఉండి. ఏదేవుడి దగ్గరకు వెళ్ళినా భోగాల గురించే అడుగుతాము. గుడికి వెళ్ళినప్పడు నాకు మోక్షం ప్రసాదించు, నాకు జ్ఞానం ప్రసాదించు అని మనలో ఎవరైనా భగవంతుడిని అడుగుతున్నారా? అడగటంలేదు. బుర్రలో ఏవో పెట్టుకొని అవి నెరవేర్చమని భగవంతుడిని అడగటం. ఇంక భక్తి ఎవరికి కావాలి, జ్ఞానం ఎవరికి కావాలి. అన్ని మార్గాలలోనికి భక్తిమార్గం చాలా తియ్యగా ఉంటుంది. దేవుడిపట్ల ఆరుచి నీకు దొరికితే ఆయనను పొందేసినట్లే. ఆరుచే మిమ్మిల్ని శుచి చేస్తుంది. శుచిచేసి అనుభవానికి అతీతమైన వస్తువును మీకు పట్టి ఇస్తుంది. మీ అనుగ్రహం వలన చాలామంది

అనుభవం పొందారు అని, ఉన్నది ఏదో దానిని ఎరుకలోనికి తెచ్చుకోగలిగారు అని నాకు తెలిసింది. అందువలన మీరు నాపట్ల దయ చూపించి పూర్వం కొంతమంది మీ ద్వారా ఎలా తరించారో అలా నన్నుకూడా తరింపచేస్తారని ఇక్కడకు వచ్చాను అని ఒక అమ్మగారు భగవాన్‌తో చెపుతున్నారు. నేను స్త్రీని, పురుషులు మాదిరిగా ఎప్పడు రావాలంటే అప్పడు రావటం కుదరదు. అందువలన నిరంతరం మిమ్మల్ని స్మరించుకొనేటట్లు, మా ఇంట్లోనే మీ ప్రెజెన్స్ ఫీల్ అయ్యేటట్లు నన్ను అనుగ్రహించండి. నేను ఇంటికి వెళ్ళిపోతున్నాను. రోజు రోజూ రావటానికి అవకాశం లేదు. అందువలన మీ ప్రేమను చూపించి, దయను చూపించి మిమ్మల్ని స్మరించుకొనేటట్లు అనుగ్రహించండి అని అడుగుతోంది. మీ వూరు వెళ్ళిపోతాను అంటున్నావు. ఎక్కడికి వెళ్ళిపోతావు? నీవు శరీరం అయితే ఏదో వూరు వెళ్ళిపోతావు. కాని నీవు శరీరంకాదు. నీవు ఆత్మవు. ఆత్మ అంతటావుంది. ఇంక వచ్చేది ఎక్కడికి? పోయేది ఎక్కడికి? నీవు శరీరంకాదు అని నీకు తెలిసింది అనుకో ఇంక ఎక్కడికి వెళతారు? నీవు లేనిచోటు ఉంటేకదా వెళ్ళటానికి అంటున్నారు భగవాన్. దేహము నేను అనుకోవటం వలన అసలు వస్తువును మిస్ అయిపోతున్నారు. మనం చేసినది చొన్నపొరపాటు కాని బాధ చాలా ఎక్కువ.

స్వామీజీ ఏమి చెప్పారు అంటే కేవలము మనం అన్నం తినటానికి, బట్టలు కట్టుకోవటానికి, ఊరేగింపులకు ఈభూమి మీదకు రాలేదు. మనం బలోపేతులమై, ఆత్మవిశ్వాసం పెంచుకొంటూ, చైతన్యస్థాయి పెంచుకొంటు, లోకంలో వచ్చే ఆటుపోట్లను తట్టుకొంటూ ఆత్మానుభవం పొందటానికి ఈభూమి మీదకు వచ్చాముగాని ఏదో తినటానికి, తిరగటానికి ఈభూమి మీదకు రాలేదు. నాకు కష్టం వచ్చింది. నాకు బాధ వచ్చింది అని చాలామంది అంటూ ఉంటారు. అలా అనికంగారుపడకు. నిన్ను బలోపేతుడిని చేయటానికి, నీకు ఆత్మవిశ్వాసం పెరగటానికి ఆకష్టం వచ్చింది, అందుకే నీవు ఈభూమి మీదకు వచ్చావు, నీవు పిరికివాడవు అయితే ధైర్యం పెంచుకోవటానికి, నీకుమనోబలం లేకపోతే మనోబలం పెంచుకోవటానికి తదనుగుణమైన ట్రైనింగ్ పొందటానికి ఈభూమి మీదకు వచ్చావు. దేహం యొక్క కదలికలను, చావు పుట్టుకలను నీమీద ఆరోపించుకోవద్దు. నర్సాపురం నుండి చిలకలపూడి వచ్చినంత మాత్రంచేత యోగులు అవ్వరు. ఈశరీరం చనిపోయి కొత్త శరీరంలోనికి వెళితే మీరు యోగులు అవ్వలేరు. వర్తమానకాలాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకొంటూ బలోపేతులు అవ్వాలి. నామనస్సులో ఏమి ఉందో మీకు తెలుస్తోంది అని ఒక భక్తుడు భగవాన్‌తో అన్నారు. దానిని బట్టే తెలుస్తోందికదా మనం అంతా ఒక్కటే అని అన్నారు భగవాన్. మనం వేరువేరుగా ఉన్నాము అని అనుకొంటున్నాము. మనం వేరువేరుగా లేము. దేహబుద్ధివలన వేరువేరుగా ఉన్నట్లు మనకు అనిపిస్తోంది. ఉన్నది ఒక్కటే. దేహము నేను అనే తలంపే సైతాను. దానిని శిలువ వెయ్యాలి. దేహము నేను అనే తలంపును శిలువ వేస్తే నీవు దేవుడవు అయిపోతావు. దృశ్యాలు అన్నీ కదిలిపోతూ ఉంటాయి. నీమనస్సు, దేహము, ఈలోకము, చావుపుట్టుకలు ఇవి అన్నీ నీచేత చూడబడుతున్నాయి. నీచేత చూడబడేది ఏది నీవుకాదు. నువ్వు దృక్కుగా ఉన్నావుగాని దృశ్యంగాలేవు. నీచేత చూడబడేది ప్రతీదీ కాలప్రవాహంలో కొట్టుకొనిపోతుంది. దేహము నేను అనే తలంపు మీకు గాఢనిద్రలో లేదు. అది జాగ్రదవస్థలో ఉంది. జాగ్రదవస్థలో ఈదేహము నేను అనే తలంపును పోగొట్టుకొంటే గాఢనిద్రలో ఉన్న సుఖం, ఆనందం జాగ్రదవస్థలో నీకు వచ్చేస్తుంది, ఇది బాగా గుర్తుపెట్టుకోండి.

అనుగ్రహం కావాలి అని అడుగుతున్నావు. అనుగ్రహం బయటలేదు. అనుగ్రహం నీ లోపలేఉంది. లోపలఉన్న అనుగ్రహమే నిన్ను ఉద్ధరిస్తుంది. అనుగ్రహం గురించి నేను ఏదైన మాట్లాడినా నిన్ను ఉద్ధరించేది లోపల ఉన్న అనుగ్రహమే. నీలోపల ఉన్న అనుగ్రహాన్ని గుర్తించటానికి నామాట నీకు సహకరించవచ్చు అంతవరకే., నిజమైన అనుగ్రహం బయటలేదు, నీలోపలేఉంది. అనుగ్రహం కావాలి అంటున్నావు. అనుగ్రహం అంటే ఎవరు అనుకొంటున్నావు, ఆత్మే అనుగ్రహం. అదే చైతన్యం, అదే చావులేని వస్తువు. అది లేదు అనుకో నీకు ఉనికే లేదు. నీలోపల అనుగ్రహం లేదు అనుకో నీకు అసలు అస్థిత్వమేలేదు. సూర్యుడిని, వెలుతురిని వేరుచేయలేము. నిప్పను వేడిని వేరుచేయలేము. అలాగే ఈశ్వరుడిని అనుగ్రహాన్ని వేరుచేయలేము. ఈశ్వరుడు ఏదిచేసినా అనుగ్రహమే. వారి ఆగ్రహం కూడా అనుగ్రహమే. ఈలోకంలో ధన్యులు ఎవరు అంటే, ఈలోకంలో కృతార్థులు ఎవరు అంటే ఈశ్వరుడి ఆగ్రహం కూడా అనుగ్రహమే అని తలచినవారు ఈలోకంలో ధన్యులు, కృతార్థులు. మీరు చెప్పిన విషయాలు అన్నీ భాగానే ఉన్నాయి. తత్వానికి పనికివస్తాయి. మనస్సు నశించిన వాడికి పనికి వస్తాయి కాని నాకు మనస్సు పోలేదు. అందుచేత మీనామం మీరూపం కావాలి. ఎందుచేతనంటే మనస్సు బలోపేతం కావాలి. జీవితంలో వచ్చే కష్టసుఖాలను తట్టుకొనేశక్తి కావాలి. ఆశక్తి కావాలంటే మీరూపధ్యానం, మీ నామస్మరణ కూడా అవసరమే. మీరు చెప్పినది తత్వం ప్రకారం సరిపోతుంది. కాని ప్రాక్టికల్‌గా నా గురించి చూడండి. మీరు మనస్సు

నశించిన వాడి గొడవ చెప్పారు, ఇక్కడ మనస్సు ఉందికదా. మనస్సు లోకంలో ఉన్న ఆటుపోట్లను తట్టుకోవాలంటే మనస్సు ధృడం అవ్వాలి. అందుచేత మీ రూపాన్ని ధ్యానించటంవలన, మీ నామాన్ని స్మరించటంవలన మనస్సుకు ధృడత్వం వస్తుంది. ప్రాక్టికల్‌గా మీరూపం, మీ నామం జ్ఞాపకం ఉండేటట్లు చేయండి. దానివలన తట్టుకొనేశక్తి వస్తుంది. మీ అనుగ్రహం లేకపోతే నామస్మరణ జరగదు. ఒకవేళ నేను నామాన్ని చేస్తున్నా అది నా తెలివితేటల వలనకాదు, అది కూడా మీ అనుగ్రహం వలననే స్మరించుకొంటున్నాను అని నాకు స్ఫురించాలి ఆవిధంగా ఈజీవుడిని అనుగ్రహించండి అని ఆమె అడుగుతున్నారు. భగవాన్ సరిసరి అన్నారు. చంటిపిల్లను ఎత్తుకొని ఒక అమ్మగారు నిలబడి ప్రయాణం చేస్తున్నారు అనుకోండి. మీరు నిలబడి మీసీటును ఆవిడకు ఇచ్చారు అనుకోండి. ఒకయజ్ఞం చేసిన దానికంటే దీనివలన భగవంతుడు నిన్ను ఎక్కువ అనుగ్రహిస్తాడు. అది హ్యూమన్‌టచ్. హ్యూమన్‌టచ్ ఉన్నవాడికి అనుకోకండా డివైన్‌టచ్ వస్తుంది. మీరుచేసింది చిన్నపనే. మనం చిన్నపనులలో ఉన్న అందాలను చూడటం మానివేసాము. పెద్దపనులు ఎలాగు చేయలేము. మనచేతిలో ఉన్న పనిని చేద్దాము అంటే దాని మీదకు మనస్సు వెళ్ళటంలేదు. భగవంతుడు దృష్టిలో చిన్నపని, పెద్దపని అని లేదు. అది ఏ ఉద్దేశంతో చేస్తున్నాము అని భగవంతుడు చూస్తాడు.

## రమణభాస్కర

(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, ది. 19-02-02, గణపవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ప్రపంచంలో అనేక ఆకర్షణలు ఉంటాయి. ఈనామరూపజగత్తు అంతాకూడా అజ్ఞానజనితం. శక్తిలేకుండా ఇందులోనుండి విడుదలపొందలేము. భక్తివలన మనకు శక్తి వస్తుంది. మీరుఅందరూ నన్ను ద్వేషిస్తున్నారుఅనుకోండి. అలాగని నేనుకూడా మిమ్మల్ని ద్వేషిస్తూఉంటే నేను నాన్నగారు అవ్వను, వెంకటలక్ష్మీనర్శింహరాజు అవుతానుఅంటే ఒకదేహానికి, ఒకనామానికి పరిమితం. మీరునన్ను గాఢంగా ద్వేషిస్తున్నప్పటికి నేను మిమ్మల్ని గాఢంగా ప్రేమించగలిగితే నేను నాన్నగారు. ఒకపేరుకు, ఒకదేహానికి, పరిమితమైపోతే జ్ఞానంకలుగదు. నేను ఒకదేహానికి, ఒకపేరుకు పరిమితమైపోతే అక్కడనుండి బాధప్రారంభమవుతుంది.





దేహమునేనుఅనే సంకల్పంనుండి వచ్చే ప్రతీ సంకల్పంకూడా మనలను రాంగ్‌డైరక్షన్ లోనికి తీసుకొని వెళుతుంది. దీనివలన మనకు స్వార్ధం పెరుగుతుందిగాని తత్వంతెలియదు. నీకు నిజంగా స్వార్ధంలేకపోతే అది భౌతికంగా తెలియబడాలి. అంతేగాని మాకు స్వార్ధంలేదుఅని చెపుతూ భౌతికంగా స్వార్ధపూరితంగా జీవిస్తూఉంటే దానిని నమ్మటానికి వీలులేదు అన్నారుబాబా. మీరు ఏదైనా రంగంలో అభివృద్ధిలోనికి రావటానికి ప్రయత్నంచేస్తూఉంటే దానిని ఎవరైనా ఆటంకపరుస్తూఉంటే దానిని తట్టుకోవటానికి మీకు తగిన శక్తిఅవసరం. ఆశక్తి భక్తివలనవస్తుంది.

కొంతమంది మంచిపనులుచేయాలిఅనుకొంటారుగాని భయంవలన ఆపనులు చేయలేరు. ఆధ్యాత్మికపురోభివృద్ధిని భయంనిరోధిస్తుంది. భయమే మనకు నిజమైన శత్రువు. మనకు నిజమైన శత్రువులు బయటలేరు లోపలేఉన్నారు. బయట శత్రువులు మనలను ఏమీచేయలేరు. బయటశత్రువులు మనశరీరాన్ని చంపేస్తారుఅనుకోండి, ఆశరీరం మనంకాదుఅని మనకు తెలిసినప్పుడు ఇంకభయంఏమిటి? ఆ శరీరమే మనం అనుకొంటే నీకు భయంకలుగుతుంది. సోక్రటీసును విషంఇచ్చి చంపేసారు. ఆయన విషాన్ని పాయసంతాగినట్లు తాగేసాడు. సోక్రటీసు ఏమిచెప్పాడుఅంటే నేనుచనిపోతున్నాను, మీరుబ్రతికేఉన్నారు. నేను ఎందుకుచనిపోతున్నానో, మీరు ఎందుకు బ్రతికేఉన్నారో ఈశ్వరుడికి తెలుసు. ఈ శరీరం చనిపోవటంవలన సమాజానికి మంచిజరిగితే నేను ఇష్టంగా చనిపోతాను అన్నాడు సోక్రటీసు. అంతేగాని మరణానికి భయపడి ఆయన ఎక్కడికి పారిపోలేదు. మనకు దేహంతో, మనస్సుతో, బుద్ధితోఉన్న తాదాప్యంవలన దుఃఖంవస్తోంది. మీఅత్తగారు తిడుతోందిఅని కోడలుతో చెపితే కోడలకు దుఃఖంవచ్చేస్తుంది. లోపలమనస్సుతో తాదాప్యంవలన దుఃఖంవస్తోంది. మనస్సుతో తాదాప్యంలేకపోతే ఉద్రేకంలేదు, వికారంలేదు, దుఃఖంలేదు. లోపలఉన్న ఆత్మతో తాదాప్యంనీకు ఉంటే దేహంవలనగాని, మనస్సువలనగాని, బుద్ధివలనగాని వచ్చే ఉద్రేకాలకు లోనవ్వరు. ఇది సరిగా అర్ధంచేసుకోండి.

వ్యక్తిభావన తగ్గించుకొంటూరావాలి. మంచిపనులుచేయాలి గుర్తింపులు కోరకూడదు. గుర్తింపులుకోరుకొంటే వ్యక్తిభావన పెరిగిపోతుంది. ధనంవలనగాని, కీర్తివలనగాని చదువువలనగాని ఇంతవరకు ఈసృష్టిలో ఎవరికి మోక్షంరాలేదు. నేను మంచిపనులు చేస్తున్నాను, నేనుచేస్తున్నట్లు ఇతర నేనులకు తెలియాలిఅంటే ఈనేను ఎంతనిజమో

ఇతరనేనులుకూడా అంతేనిజం. ఈ దొంగనేను చేసేపని ఇతరదొంగనేనులకు తెలియాలి. శాస్త్రాలు చదవటంవలన జ్ఞానంరాదు. శాస్త్రాలు చదవటంమంచిదేగాని అంతమాత్రంచేత జ్ఞానంవచ్చేస్తుందిఅనుకోవద్దు. భగవద్గీత, ఉపనిషత్‌లు నేర్చుకొన్నాను పండితుడను అయిపోయానుఅనుకొంటే వాడు దొంగనేనునుండి బయటకురాలేడు సరికదా దొంగనేనును బలపర్చుకొంటాడు. మోక్షంకావాలంటే ఎంతోకొంత వైరాగ్యాన్ని పెంచుకోవాలి. నీవు నేర్చుకొన్న విద్య దొంగనేనునుండి విడుదల పొందటానికి నీకుసహకరించాలి. దొంగనేనునుండి విడుదలపొందితే మోక్షం. కాని మనంచేసే పనులద్వారా దొంగనేనును అలంకరించుకొంటున్నాము. ఇంక మనకు మోక్షంఏమిటి? శాంతిఏమిటి?

మనం భగవంతుడిని చింతించటంలేదు, విషయాలనుచింతిస్తున్నాముఅంటే మాయనుచింతిస్తున్నాము. మనంఏదైతేకాదో దానిని చింతిస్తున్నాము. ఇలా జీవించటంవలన మనం మరణానంతరం చీకటిలోకాలలో ప్రయాణంచేయవలసివస్తుంది. వెలుగు ఉన్నలోకాలకు వెళ్ళినా, చీకటిఉన్నలోకాలకువెళ్ళినా మనం తిరిగి ఈభూమిమీదకు రావలసిందే. అయితే కొన్ని అనుభవాలు పొందటానికి ఆలోకాలలో భగవంతుడు మనలను ప్రయాణింపచేస్తాడు. అక్కడ ఉన్నవాడు నారాయణుడే, మనహృదయంలోఉన్నవాడు నారాయణుడే. ఆ నారాయణుడిలో ఐక్యంచేసేవాడే సద్గురువు ఆయనే సాయిబాబా. నీవు ఏవస్తువుగా ఉన్నావో దానితో తాదాప్యంలేకుండా నేనుదేహంగాఉన్నాను, నేను మనస్సుగా ఉన్నాను అనుకొన్నంతకాలం నీవు మాయలోనుండి విడుదలపొందలేవు. నీకు ఆత్మతెలియనప్పడు, ఆత్మకానిదానిని నీవు అనుకొంటూనే ఉంటావు. నీవు ఈశ్వరుడిని స్మరించగా, స్మరించగా ఆయన దయవలనమాత్రమే ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు. ఒకమాట మాట్లాడితే, ఒకపనిచేస్తే, ఒకతలంపువస్తే అది ఈశ్వరునిదయను పొందటానికి మనకు సహకరించాలి. మన ప్రవర్తన బాగుండాలిఅని అనుకొంటే సరిపోదు, అదిప్రాక్టికల్‌గా రావాలి. మన ప్రవర్తన సరిదిద్దుకోవాలిఅంటే దానికి శక్తికావాలి; భక్తివలన మనకు శక్తికలుగుతుంది. నీకు ఏదైనా మంచితలంపువచ్చిందిఅనుకో, దానిని ఆచరణలో పెట్టలేకపోతున్నావుఅనుకో అంటే నీలోఏదో వెలితిఉందిఅని అర్థం. అది ఎక్కడ ఉందో వెతికి పట్టుకొని దానిని తొలగించుకో అదే సాధన. మనం ఎన్నో రచనలుచేస్తాముఅనుకోండి, ఉపన్యాసాలు చెపుతాముఅనుకోండి. రాగద్వేషములనుండి బయటకురాకపోతే





ఇదిఅంతాసున్నా. మనం ఎప్పడైనా కోపంతో మాట్లాడుతున్నాముఅనుకోండి ఇదికోపంతో మాట్లాడుతున్నాముఅనే గుర్తింపుకూడా మనకులేదు. ఎందుచేతనంటే మనకు సాధనలేదు. నీవు కళ్ళతోచూసేదిగాని, చెవులతోవినేదిగాని, మనస్సుతో ఊహించేదిగాని ఏదీనిజంకాదు. నీదేహానికి, మనస్సుకు, బుద్ధికి అతీతంగా ఒకనగ్నసత్యం నీహృదయంలోఉంది. కాని అది నీశరీరంలో ఒకభాగంకాదు. అది నీకు అనుభవంలోనికివచ్చేవరకు నీకు స్వేచ్ఛలేదు. నీవు నిరంతరం భగవంతుడిని చింతించగా, చింతించగా ఆ చింతనలో నీవుకానిదానిలోనుండి విడుదల పొందుతావు. నీవుకానిదానిలోనుండి విడుదలపొందినవెంటనే నీవుఏదిగాఉన్నావో అదినీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. భగవంతుని స్మరించగా, స్మరించగా ఆయనను ధ్యానించగా ధ్యానించగా, మన ఇష్టాలను ప్రక్కనపెట్టి ఆయనకు ఇష్టమైన పనులు చేస్తూఉంటే ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు. లోపలఉన్న ఈశ్వరుడితో అనుబంధంలేకుండా, బయట ఉన్న వ్యక్తులతో, వస్తువులతో దేనితో నీకు అనుబంధంఉన్నా అది భ్రాంతిమాత్రమే, భ్రమమాత్రమే. భ్రాంతినుండి, భ్రమనుండి విడుదలపొందినవాడికి మాత్రమే శాంతి కలుగుతుంది.

నీకు జ్వరంవచ్చిందిఅనుకో. ఆజ్వరం పూర్తిగా తగ్గినప్పడే నీకు ఆరోగ్యం చేకూరుతుంది. అలాగే దేహమునేనుఅనేతలంపు నిశ్శేషంగా నశించినప్పడే నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. అహంభావననుండి పూర్తిగా విడుదలపొందినప్పడు హృదయంలోఉన్న వస్తువుయొక్క మాధుర్యం నీకు తెలుస్తుంది. విషయాన్ని శ్రద్ధగా శ్రవణంచేయటంవలన, దానిని మననంచేయటంవలన లోపలఉన్న వస్తువు ఎంతోకొంత అనుభవంలోనికి రావటంవలన మనస్సుయొక్క చాపల్యం తగ్గుతుంది, మనస్సు బాహ్యాముఖంగా వెళ్ళటంతగ్గుతుంది. నీకు సాధనా బలంలేకపోతే, భక్తిలేకపోతే గాలికి ఆకుఎలాకదులుతుందో అలాగ ప్రతీచిన్న సంఘటనకు నీమనస్సు కదిలిపోతూ ఉంటుంది. నీకు ఈశ్వరుడి పాదాలపట్ల భక్తిపెరిగేకొలది నీకు ఏకాగ్రత వస్తుంది, వివేకంపెరుగుతుంది, పవిత్రతకలుగుతుంది. నీ మాటలో, వ్యవహారంలో నిగ్రహంవస్తుంది. నీకులోచూపుకలుగుతుంది. నీకు ఈశ్వరుడిపట్ల పరిపూర్ణమైన ప్రేమ ఉండాలి, భక్తిఉండాలి. నీకోరికలు నెరవేరినా, నెరవేరకపోయినా ఆయనపట్ల సజీవమైన విశ్వాసంఉండాలి. కారణభక్తివలన మోక్షంరాదు. ఈశ్వరుడిపట్ల భక్తిఉండాలి. ఆయన దగ్గరనుండి ఏదోపొందాలిఅనే కోరిక కనబడకూడదు. అప్పడు ఆయన స్వరూపాన్ని మనకుఇస్తాడు. చేపలు పట్టుకోవటానికి గేలానికి మేతకడతారు. చేపకుపెట్టటానికికాదు,

చేపలనుపట్టుకోవటానికి ఆమేతను అక్కడ కడతారు. అలాగే కొంతమంది భక్తులుకూడా భగవంతునిదగ్గరనుండి ఏదోపొందటంకోసం ఆయనకు పూలు, పళ్ళు ఇలాఏవో సమర్పిస్తూఉంటారు అటువంటి భక్తివలన నీకు మోక్షంరాదు, దానివలన నీకోరికలు నెరవేరితే నెరవేరవచ్చుఅంటున్నారు బాబా. నీకు ఏకోరిక ఉండకూడదు, భగవంతునిపట్ల ఇష్టంఉండాలి. ఆయన సంకల్పమే మనసంకల్పం. ఆయనకంటే మనం వేరుగాలేము. బహుమానంఅయినా ఆయనే, తిరస్కారంఅయినా ఆయనేఅన్నీ ఆయనే. నిన్ను ఎవరైనా గౌరవపరచినా అదీదేవుడే, నిన్ను ఎవరైనా అగౌరవపరచినా అదీ దేవుడేఅనుకోండి; అది శరణాగతి. నీవు అవమానంవచ్చినప్పుడు కృంగిపోతూ, ఊరేగింపులువచ్చినప్పుడు పొంగిపోతూఉంటే నీవు మనస్సుగా జీవిస్తున్నావుకాని ఆత్మగా జీవించటంలేదు. ఆత్మగా జీవించేవాడికి ఆత్మతెలుస్తుందిగాని దేహంగా, మనస్సుగా, బుద్ధిగా జీవించేవాడికి ఆత్మఎలా తెలుస్తుంది. ఈశ్వరుడిని ఎలా ప్రేమించాలిఅంటే ఆయనదగ్గరనుండి ఏమీ వాంఛించకూడదు, ఆయనను ఆయనకోసమే ప్రేమించాలి. అది పూర్ణశరణాగతి. అప్పుడు నీకు తత్వంతెలుస్తుంది. అనేకమందిని చూస్తున్నాము అందరూ సంసారంలో గొడవలగురించి అడిగేవారేగాని మాకు జ్ఞానంకావాలిఅని అడిగేవారు ఎవరూ కనబడటంలేదు. జ్ఞానంఎవరికి అక్కరలేదు ఎందుచేతనంటే దాని వైభవం ఎవరికి తెలియటంలేదు. మనకు మనస్సే నేనుగా వ్యక్తమవుతోంది. దానిమూలాన్ని చూసినా ఆనేనుపోతుంది. లేకపోతే ఈసృష్టికి యజమాని ఒకడు ఉన్నాడు ఆయనపట్ల భక్తిపెంచుకొని, ఆయనకు శరణాగతిచేసినా నేనుపోతుంది. నీవు భక్తిమార్గంలో ప్రయాణంచేసినా, జ్ఞానమార్గంలో ప్రయాణంచేసినా దేహమునేనుఅనేతలంపునుండి విడుదలపొందాలి. కాని మనం ఏమిచేస్తున్నాముఅంటే దానినుండి విడుదలపొందటం మానివేసి దానిని అలంకరించుకొంటున్నాము.

నాకు మోక్షం ఎప్పుడువస్తుందిఅని భగవాన్‌ను అడిగితే భగవాన్ ఏమిచెప్పారుఅంటే నేనుఅసలు పుట్టలేదుఅని నీకు తెలిసినప్పుడు నీకు మోక్షంవస్తుందిఅని చెప్పారు. ఇప్పుడు మనంపుట్టాముఅనుకొంటున్నామా, పుట్టలేదుఅనుకొంటున్నామా? మనం పుట్టాము అనుకొంటున్నాము అందువలన మనకు మోక్షంలేదు. నీకు ఆత్మానుభవంకలిగినప్పుడు నేను అసలు పుట్టలేదుఅన్న సంగతి నీకు తెలుస్తుంది. మీకు ఇష్టంలేనితలంపులు వచ్చినప్పుడు, ఇష్టంలేని సంఘటనలు జరిగినప్పుడు మనకు దుఃఖంవస్తుంది. ఇష్టంలేని తలంపులువచ్చినా,





ఇష్టంలేని సంఘటనలు జరిగినా వాటిని నిరోధించుకొనే శక్తి నీకు ఉన్నప్పుడు ఇంక దు:ఖంరాదు. ఈశ్వరునిపాదాలను ఆశ్రయించటంవలన ఈశ్వరుని ఉపాసించటంవలన వాటిని నిరోధించేశక్తినీకువస్తుంది. నీవు ఏమార్గంలో ప్రయాణంచేసినా ఇబ్బందిలేదు. నేనుకర్తనుకాదుఅని పనిచేస్తూఉంటే కర్మమార్గంకూడా నీకు మోక్షాన్ని సంపాదించిపెడుతుంది. అహంకారముతో నీవు మంచిపనులుచేస్తే దానివలన పుణ్యంవస్తుంది. అదే కర్మ నీవు అహంకారంలేకుండా చేస్తే నీకు పుణ్యంవస్తుంది, మోక్షంకలుగుతుంది. నీవు ఏమార్గంలో ప్రయాణంచేసినా ఇష్టంతోచెయ్యి. ఇష్టంఉన్నచోట నీకు కష్టంఉండదు. ఏపనిచేసినా ప్రీతిగాచెయ్యి, ప్రేమగాచెయ్యి, లోపలఅంతర్యామిగా ఉన్న నారాయణుడిని మర్చిపోకు. భీమవరంనుండి 20 కి॥మీ॥ ప్రయాణంచేసి గణపవరంవచ్చాముఅనుకోండి. మరల తిరిగి 20 కి॥మీ॥ వెనుకకు వెళితేగాని భీమవరంరాదు. 15 కి॥మీ॥ వెనుకకువెళ్ళి ఇంకా భీమవరంరాలేదుఅంటే రాదు. నీవు 20కి॥మీ॥ ప్రయాణంచేయవలసిందే. అలాగే నీవు ఎవరిగాఉన్నావో అక్కడనుండి ఎంతదూరంఅయితే పతనమయ్యావో మరల అంతదూరం వెనుకకు వెళితేగాని ఆత్మస్థితి నీకు కలుగదు. ఎక్కడనుండి పతనమయ్యావో మరల అక్కడకు చేరుకొనేవరకు ఆస్థితిమనకు అందదు.

మన నిజమైనఇల్లు మన హృదయంలోనేఉంది. మనస్సు ఆగూటిలోపడేవరకూ ఈశరీరాలు ధరించటంతప్పదు, లాభనష్టాలు, సుఖదుఃఖాలు ఈద్వంద్వాలమధ్యన నలిగిపోవటంతప్పదు. శరీరంవచ్చిందిఅంటే మరణించటంతప్పదు, మరణించినవాడు జన్మించటంతప్పదు. ఆమధ్యలో ద్వంద్వాలలో నలిగిపోతూఉంటారు. ఇదే సంసారం. మరణానంతరం మనకు తోడుగా ఉండేవాడు ఈశ్వరుడుఒక్కడే. ఆయనే మనగతి. మనస్సులో భోగవాంఛ ఉన్నంతకాలం వాడికి దేహంవచ్చితీరుతుంది ఎందుచేతనంటే దేహంలేకపోతేవాడు భోగాన్ని అనుభవించలేడు. మనకు భోగాలు నెరవేరటంలేదుఅనుకోండి అప్పుడు మనస్సు ఏమిచేస్తుందిఅంటే స్వప్నంలో వాటిని నెరవేరుస్తుంది. భోగవాంఛ ఎంత బలీయంగా ఉంటుందో చూడండి. మనస్సుఉంటే అంతాఉంది, అదిలేకపోతే ఏదీలేదు. బంధంఎవరుఅంటే మనస్సు. దానినుండి విడుదలపొందితే మోక్షం. అందువలన మనస్సును పెంచుకోకూడదు. కామక్రోధములవలన మనస్సు పెరుగుతుంది, వేరుబుద్ధివలనకూడా మనస్సు పెరుగుతుంది. నీధనంచూసిగాని, కీర్తిచూసిగాని, పాండిత్యంచూసిగాని గర్వంతెచ్చుకొన్నావా ఆక్షణంనుండి

పతనంప్రారంభం. మనస్సులోపలకు వెళితే మోక్షం, బయటకువస్తేబంధం. మనలను పాడుచేసేదీ మనస్సే, మనలనుబాగుచేసిదీ మనస్సే. ఆ మనస్సును బాగుచేసుకోవటానికే పూజలు, జపాలు, ధ్యానాలు, మహాత్ములుచెప్పింది శ్రవణంచేయటం. ఆమనస్సు అణిగిపోతే ఏమిలేదు. మనస్సు ఉన్నవాడికి ధర్మంఉంది, అధర్మంఉంది. మనస్సు అణిగినవాడికిఏమిలేదు వాడు అన్నింటికి అతీతం. కృష్ణుడు గీతలో ఏమిచెప్పాడుఅంటే నీమనస్సును బాగుచేసుకొనే శక్తిఉంటే బాగుచేసుకో. ఒకవేళ నీకు ఆశక్తిలేకపోతే నీమనస్సు ను నాకు ఇచ్చెయ్యి, నేను బాగుచేసిపెడతానుఅని చెప్పారు.

ఓం నమోభగవతే శ్రీరమణాయ

రమణభాస్కర

(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, ది. 23-02-02, చించినాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సంపదఅంటే పొలాలలో, ఫ్యాక్టరీలలో, బ్యాంక్‌లలోఉందిఅని మనం అనుకొంటాము. కాని మన సంపద బయటలేదు. నిజమైనసంపద మనలోపలేఉంది. మనస్సులో సంపద ఉన్నవాడు మాత్రమే నిజమైన ధనవంతుడు. మనస్సులో సంపదలేనివాడు వాడికి బ్యాంక్‌లో ఎంతధనంఉన్నా, ఎన్ని ఫ్యాక్టరీలు ఉన్నావాడు దరిద్రుడు. బాహ్యమైన సంపదనుచూసి భగవంతుడు అనుగ్రహించడు. మనస్సులో ఎవరికైతే సంపద ఉందో వారిని మాత్రమే భగవంతుడు అనుగ్రహించి, ఆయనస్వరూపాన్ని ఇస్తాడు. మనచేతిలోఉన్న పనిని మనం దోషంలేకుండా, కపటంలేకుండా హృదయపూర్వకంగాచేయాలి. ఫలితంగురించి ఆలోచనవద్దు. ఫలితం మనచేతిలోలేదు. మనచేతిలోలేని దానిగురించి ఆలోచించటంకంటే మన చేతిలోఉన్న పనిని శ్రద్ధగా చేయటంమంచిది. కొంతమంది పనిచేస్తారుకాని విసుగ్గాచేస్తారు. అలాకాకుండా మనంచేసేపని ప్రేమగా, శాంతిగా చేయాలి. భగవంతుని దృష్టిలో ఇది చిన్నపని, ఇదిపెద్దపని అనిఏమిలేదు. అందుచేత మనంచేసే పనిచిన్నపనిఅయినా ఆడంబరంలేకుండాచేస్తే, అహంభావనలేకుండాచేస్తే దేవునిఅనుగ్రహానికి పాత్రులవుతాము. జీవితంలో ఈశరీరంపడిపోయేలోపు కొన్ని మంచిపనులుచేయాలి. మంచిపనులు చేయటంవలన ఈసృష్టిలో నలుగురికి సహాయపడినట్లుఅవుతుంది, మనకు చిత్తశుద్ధి





కలుగుతుంది. చిత్తశుద్ధి లేనివాడు ఎన్నిపూజలు, జపాలుచేసినా వాడికి శాంతిలేదు, జ్ఞానంలేదు. వాలుగాలిలో సైకిలుత్రొక్కితే ఎలా ఉంటుందో అలాగ చిత్తశుద్ధి ఉన్నవాడు పూజచేసినా, జపంచేసినా, ధ్యానంచేసినా సడన్‌గా అందుకొంటుంది, వాడి చైతన్యస్థాయి పెరుగుతంది, ఉజ్వలంగాప్రకాశిస్తాడు. మనం ఏగమ్యానికి చేరటానికి సాధనచేస్తున్నామో చిత్తశుద్ధి ఉన్నవాడు ఆగమ్యాన్ని శీఘ్రంగాచేరుకోగలడు. చెట్లుపుడతాయి, పెరుగుతాయి, చనిపోతాయి. అలాగే కొంతమంది మనుషులుకూడా పుడతారు, పెరుగుతారు, మరణిస్తారు. వారిలో వికాసంఏమిఉండదు. ఎందుకుపుట్టారో, ఎందుకు జీవిస్తున్నారో వారికి తెలియకుండానే మరణిస్తారుఅన్నారు స్వామిజీ. మీజీవితంలోఏవైనా మధురక్షణాలఉంటు ఇటువంటి మాటలను శ్రవణంచేయటమే. మధురక్షణాలు అంటే భగవంతుని గురించి శ్రవణంచేయటమే మధురక్షణాలు. నా హృదయంలో తియ్యదనంఉంటే మీహృదయానికి ఎంతోకొంత తియ్యదనం వస్తుందిగాని నాహృదయాంలో విషంపెట్టుకొని, చేదుపెట్టుకొని మిమ్మలను తియ్యటి మనుషులుగా చేయాలంటే సాధ్యంకాదు, నేనుచేయలేనుకూడా.

ఎవరైనా ఆకలితోబాధపడుతూఉంటే మనం వారికి అన్నంపెట్టవచ్చు, ఎవరైనా బట్టలులేకుండా బాధపడుతూఉంటే మనం వారికి బట్టలుఇవ్వవచ్చు. ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతూఉంటే వారికి మందులుఇవ్వవచ్చు. కాని జ్ఞానం సంపాదించాలిఅనే కోరికలోపలనుండి కలుగజేయటం వీటిఅన్నింటికంటేగొప్పది, ఉదాత్తమైనది. జ్ఞానంపట్ల తపనను, జిజ్ఞాసను ఎవరైతే కలుగుజేస్తున్నారో వారు సమాజంలో అందరికంటే గొప్పవారు. వారి మొఖంవంక చూడటానికికూడా మనం సరిపోము, పాదాలనుచూసి సంతోషించవలసిందే. మన మనస్సును బాగుచేసుకోవాలిఅనే తపనలేకపోతే, జ్ఞానంపట్ల జిజ్ఞాస మనకు లేకపోతే మనం మాంసపుముద్దలతో సమానము. అన్నంతినటంవలన శరీరం ఎదుగుతోంది అలాగే మనమనస్సు ఎదగటానికి, మనమనస్సు పవిత్రంఅవ్వటానికి ఆధ్యాత్మిక ఆహారంఅందించేవాడే నిజమైన గురువు. మనం మంచివారముఅని అనుకోకూడదు, మనం చెడ్డవారముఅని అనుకోకూడదు. మంచివారముఅనుకొంటే గర్వంవస్తుంది, చెడ్డవారముఅనుకొంటే డిప్రెషన్‌వస్తుంది. మనం మంచివాళ్లముకాదు, చెడ్డవాళ్లముకాదు. మనం ఆత్మ, మనం చైతన్యం. మంచి, చెడు అనేవిజీవలక్షణాలు. ఆత్మలోమంచిచెడులేదు.

మనం ఆత్మఅయిఉన్నాము. మనం మంచివాళ్ళముఅనుకొన్నా, చెడ్డవాళ్ళము అనుకొన్నా ఆధ్యాత్మికపురోగతి ఆగిపోతుంది. మనం ఏదిగా ఉన్నామో అది అయ్యి జీవించటానికి ప్రయత్నంచేయాలి. సొంతఆలోచనను, తెలివిని, వివేకమును విడిచిపెట్టవద్దు. మనగమ్యాన్ని మర్చిపోకూడదు. సాధన విడిచిపెట్టకూడదు. మరణించినతరువాత మనకూడా వచ్చేవాడు, మనకష్టసుఖాలనుచూసేవాడు ఈశ్వరుడుమాత్రమే. ఆయనపట్ల వినయమును, ప్రేమను, భక్తిని కలిగిఉండాలి. భగవంతుడు ఒక్కొక్కరికి చదువును, ఒక్కొక్కరికి ధనాన్ని, ఒక్కొక్కరికి తెలివినిఇస్తాడు. భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశములను స్వార్థానికికాకుండా, సృష్టిరూపంలోఉన్న ఆయనకే సమర్పిస్తూఉంటే అది పనిద్వారా భగవంతుడిని ఆరాధించినట్లు అవుతుంది. ఈ ప్రపంచంలో ఏమీలేదు, ఏదోఉంది అని మనం అనుకొంటాము. మనం ట్రైనింగ్ పొందటానికి ఈభూమిమీదకు వచ్చాము అందుచేత ప్రోపర్‌గా ట్రైనింగ్ అయ్యి బయటకువెళ్ళిపోవాలి. నేను కాఫీకప్పు తీసుకొని మీఇంటికివచ్చానుఅనుకోండి. కప్పుఖాళీగాఉంటే అందులో కాఫీపోస్తారు. నీవుసాధనచేసి హృదయంఅనేపాత్రను ఖాళీచేసుకోగలిగితే అప్పుడు ఈశ్వరుడు అమృతంతో ఆపాత్రనునింపి, ఆయన అంతటివాడిగా మనలనుచేస్తాడు. ఇతరులు మిమ్మల్ని మంచివారుఅంటే మీరు మంచివారుఅని అనుకోవద్దు, ఇతరులు మిమ్మల్ని చెడ్డవారుఅంటే మీరు చెడ్డవారుఅని అనుకోవద్దు. వారు అలాఅంటే అనుకోనివ్వండి. మీ నిదానంలోమీరుఉండండి. మీసాధన మీరు నెమ్మదిగాచేసుకోండి. రాంగ్ డైరెక్షన్‌లోనికి వెళ్ళవద్దు. మీరుఏదైతే గమ్యంగా పెట్టుకొన్నారో ఆగమ్యంచేరుకోవటానికి నెమ్మదిగావెళ్ళినా రైట్ డైరెక్షన్‌లో వెళ్ళండి, ఆలస్యంఅయినా గమ్యాన్ని చేరుకొంటారు. అంతేగాని ప్రయాణంఆపవద్దు. ఈమధ్య ఒక అమెరికన్ ఏమిచెప్పాడుఅంటే మనం మూడురూపాయలు సంపాదిస్తే అందులో ఒక్కరూపాయి సమాజానికి ఉపయోగిస్తే ప్రపంచంఅంతా స్వర్గంఅయిపోతుంది అనిచెప్పాడు.

అన్ని సాధనలలోనికి ఉత్తమమైన సాధనఏమిటిఅని భగవాన్‌ను అడుగుతున్నారు. ఈ మార్గముమంచిదిఅని చెప్పటానికి అవకాశంలేదు. ఆమనిషియొక్క పూర్వజన్మ సంస్కారమునుబట్టి అది ఆధారపడిఉంటుంది. కొంతమందికి భక్తిమార్గం, కొంతమందిజ్ఞానమార్గం, కొంతమందికికర్మమార్గంఅంటే ఇష్టంఉంటుంది. పూర్వజన్మ సంస్కారమునుబట్టి ఒకోమార్గంఅంటే ఇష్టంఉంటుంది. అందుచేత ఎవరిమార్గంలో వారిని ప్రయాణంచేయనివ్వాలి. మీరు శాంతిగాఉండాలి, ఆనందంగాఉండాలి, మీరు పొందవలసింది ఏదో అదిపొందాలి అది ముఖ్యంగాని మీరు ఎవరిభక్తులుఅయినా, మీరు ఏమతంలోఉన్నా ఇబ్బందిలేదు. ఎవరైనా తింగరతనంగా మాట్లాడుతున్నారుఅనుకోండి. కోపంగా మాట్లాడుతున్నారుఅనుకోండి, మీరు ఆశ్చర్యపడనక్కరలేదు. వారి స్వభావం అటువంటిదిఅని వదిలివెయ్యండిఅంతేగాని వాటిని భుజానవేసుకొని తిరిగితే ఆస్వభావం మీకువచ్చేస్తుంది. ప్రతీచిన్న విషయానికి కోపంగా, విసుగ్గా ఉంటున్నారు ఏమిటిఅని మీరు దేవుడిని ధ్యానంచేయటంమానివేసి, వారి విసుగుదలను ధ్యానంచేయటంఏమిటి? వారిని ఈభూమిమీదకు ఎందుకుపంపాడో ఈశ్వరుడికి తెలుసు, నీకుఎందుకు ఆగోల. వారి స్వభావంఅంతే అనుకొని వారిని మీతలకాయమీద మోయటంమానివెయ్యండి. అప్పుడు మీరు ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికివస్తారు. కొంతమందికి ఈశ్వరుడిమీద పరిపూర్ణమైన విశ్వాసం ఉంటుంది. ఆయనే మనప్రభువు, ఆయనే మనకు గతిఅనే భక్తిభావనతో జీవించితరిస్తారు. కొంతమంది అందరిలో ఉన్నది నారాయణుడే అనేభావనతో పనిచేస్తూ తరిస్తారు. కొంతమందికి విచక్షణఉంటుంది. మనం ఇదికాదు, మనం ఇదికాదుఅని కానిదానిని గెంటుకొంటూవెళ్ళి ఏదైతే వారు అవునో అందులో ఐక్యంఅవ్వటానికి ప్రయత్నంచేస్తారు. ఎవరు ఏమార్గంలో ప్రయాణంచేసినా మనోనాశనంఅవ్వకుండా ఎవరికీ

**ధ్యానం, భక్తి, జపం మొదలైనవి చిత్తవృత్తుల వైవిధ్యం తొలగించడానికి సాధనాలు. వాటి వలన ఒకే చిత్త వృత్తి ప్రబలి, తుదకు అది కూడా ఆత్మయందు లీనమౌతుంది.**

**- భగవాన్ శ్రీ రమణమహర్షి**

జ్ఞానంరాదు. మొత్తం దుమ్ముఅంతా మనస్సులోనేఉంది. మనం ఆమనస్సుచుట్టూ తిరుగుతున్నాము. ఇంకమనకు జ్ఞానంఎలాకలుగుతుంది?

అత్తగారు ముసలిదిఅయినతరువాత జాగ్రత్తగా చూడమనికోడలుకుచెపితే ఎప్పడో 40 సం॥లక్రితం ఆవిడిలాఅందిఅనిచెపుతారు. 40 సం॥లక్రితం తిట్టిందట అదిజ్ఞాపకంపెట్టుకొని ఇప్పడుచూడముఅనిచెపితే ఇంకవారికి ఏమిచెప్పగలము. భగవంతుడిని స్మరించటంమానివేసి 40 సం॥లనుండి ఆతిట్టులు బుర్రలో మోయటంఎందుకు. ఇదిఅంతా అజ్ఞానం. మనకు పనికివచ్చేవి మోయాలిగాని పనికిరానివిమోయకూడదు. దేహాన్ని, మనస్సును అనవసరమైన విషయాలకు ఉపయోగించకూడదు. జ్ఞానసముపార్జనకు వాటిని ఉపయోగించుకొని భగవంతుడిలో ఐక్యం అవ్వటానికి ప్రయత్నంచేయాలి. వారు మారితే బాగుండును, మాఅత్తగారు మారితే బాగుండును, మాఆయనమారితే బాగుండును అనుకోవటం శుద్దదండగ. మనం మారితే సుఖపడతాము. వారుమారాలి, వారుమారాలిఅంటే వారు మారతారా? అలాఅనుకొనేబదులు మనం మారిపోతే శరీరంమరణించేలోపుగా ఇక్కడవ్యవహారం పూర్తిఅవుతుంది, శాంతిగాబయటకుపోతాము.

భగవంతుడు నీహృదయంలోనే ఉన్నాడు. అక్కడకువెళ్ళు. అక్కడఉన్న ఆనందాన్ని అనుభవించి ఈశరీరాన్ని విడిచిపెట్టు అప్పడు తిరిగి ఈభూమిమీదకు రావలసిన పనిలేదు. హృదయంలోఉన్న వస్తువు అనుభవంలోనికి రాకపోతే ఏదోరకమైన దుఃఖం, ఏదోరకమైన విషాదరేఖ నిన్ను వెంటాడుతూఉంటుంది. మనస్సుకు మౌనంవస్తే హృదయంలో ఉన్న ఆనందంతెలుస్తుంది. ఆ ఆనందం పొంగినప్పడు, శాంతిపొంగినప్పడు అది మన సహస్రారాన్ని ముంచేస్తుంది. నీహృదయంలో ఆత్మగాఉన్నానుఅని భగవంతుడు చెపుతున్నాడు. నీముక్కులో గాలిబయటకు వెళ్ళకముందే ఆ ఉన్నదేదో నీకు అనుభవంలోనికి రావాలి. అప్పడు అది నీకడసారిజన్మ. బయటఏమీలేదు. అందంఅంతా నీలోపలేఉంది, జ్ఞానం నీలోపలేఉంది. బయట ఉన్నట్లు నీకు అనిపిస్తోంది అందువలన బయట వెతుకుచున్నావు. ఎక్కడ శాంతిలేదో, ఆనందంలేదో అక్కడ వెతుకుచున్నావు, ఉన్నచోట వెతకటంలేదు. ఇలా వందలాది జన్మలు పాడుచేసుకొంటున్నావు. ఈశ్వరుడు హృదయంలోనే ఉన్నాడు. అక్కడ వెతకండి ఆయన దొరుకుతాడు. నేనునేనుఅనేది ఒకతలంపు. దానిలోనుండి విడుదల పొందాలి. నేనుఅనే





తలంపునుండి విడుదలపొందిన మరుక్షణంలో నీవు అభయస్థితిని పొందుతావు. నీవు విషాదరహితుడవు, శోఖరహితుడవుఅవుతావు, నీమొఖంలో ఎక్కడా విషాదరేఖలు కనబడవు. నీకు ఇష్టమైతే ఆమార్గంలో ప్రయాణంచెయ్యి. నీవు విచారణ చేయవచ్చు, ధ్యానంచేయవచ్చు, జపంచేయవచ్చు. మంత్రాన్ని జపించగా, జపించగా జపినశిస్తాడు. భగవంతుడిని స్మరించండి. పవిత్రత సంపాదించండి, ఏకాగ్రతసంపాదించండి. లోపలఉన్న వస్తువు ఎంతపవిత్రమైనదో అంత పవిత్రత సంపాదించండి, ఆ వస్తువును అనుభవంలోనికి తెచ్చుకోండి, తరించండి. ఈ కర్మచక్రంనుండి, జననమరణ ప్రవాహమునుండి విడుదలపొందండి. మీరు ఏదోమార్గంలో ప్రయాణంచేయండి. చేసేది శ్రద్దగాచేయండి, అంకితభావంతోచేయండి కొంతమంది ఎలా ఉంటారు ఉంటేవారు చేసేపనులు, మాట్లాడేమాటలు వారికి ఉపయోగపడవు, ఇతరులకు ఉపయోగపడవు. ఇలా జీవితం గడుపుతూ మట్టిలోకలిసిపోతారు. మనకు పూర్వపుణ్యంలేకపోతే ఇటువంటివారితో స్నేహాలు దొరుకుతాయి. అందుచేత మనం చేయగలిగినటువంటి మంచిపనులు చేస్తూఉంటే మనకు పుణ్యంవస్తుంది, ఆపుణ్యం రాబోయే జన్మలలో

**కర్మను భగవదర్పితం చెయ్యడంవల్ల చిత్తశుద్ధి కలుగుతుంది. అయితే కర్మ చేసినప్పుడే భగవంతుని స్మరిస్తే చాలదు. భగవంతుని స్మరణ నిర్విరామంగా, సంతతప్రవాహంగా కొనసాగాలి. అప్పుడే చిత్తం విశుద్ధ మవ్వుతుంది.**

**- భగవాన్ శ్రీ రమణమహర్షి**

సత్పురుషులతో సహవాసం చేయటానికి ఉపయోగపడుతుంది. నీకు ఆత్మానుభవం కలగాలంటే, ఆత్మశాంతి కావాలంటే దాని తాలుక అనుభవం ఉన్నవాడితో సహవాసం విడిచిపెట్టవద్దు. ఎవడైతే హృదయంలో స్థిరంగా ఉన్నాడో వాడిదగ్గర నీవు కూర్చొన్నప్పుడు వాడు నీమనస్సును ఆత్మవైపుకు త్రిప్పుతాడు. నీవు ఏమార్గంలో ప్రయాణంచేసినా హృదయందగ్గరకు రావలసిందే. అప్పుడుగాని దుఃఖం నశించదు. దుఃఖం నశించకుండా శరీరం మరణించిందిఅనుకో మరల పునర్జన్మ వచ్చేస్తుంది. సత్పురుషులతో సహవాసం విడిచిపెట్టవద్దు. నీదీపాన్ని తీసుకొనివెళ్ళి వారి దీపంతో వెలిగించుకోండి. ఏదైనా ఒకదీపం వెలుగుతూఉంటే దానిద్వారా అనేక దీపాలను వెలిగించుకోవచ్చు. మనం ఎలా ఉన్నాము ఉంటే మన దీపం వెలిగించుకోవటం మానేసి వారి దీపం ఆర్పేయాలని చూస్తున్నాం. వారి దీపాన్ని మనం ఆర్పాలన్నా ఆర్పలేము ఎందుచేతనంటే అవి మనం ఆర్పితే ఆరేవికాదు, అవి జ్ఞానజ్యోతులు. ఒకసారి గాంధీగారు మళయాళస్వామిగారితో మాట్లాడుతున్నారు. గాంధీగారు టైముప్రకారం భోజనంచేస్తారు. మీకు భోజనానికి టైముఅయ్యింది, భోజనంచేయటానికి రండి ఒకరు గాంధీగారికి గుర్తుచేసారు. అప్పుడు గాంధీగారు ఏమిచెప్పారుఅంటే ఆ ఆహారం రోజూతినేదే. ఇప్పుడు జీవుడు వికాశంపొందటానికి కావలసిన ఆహారం అంటే ఆధ్యాత్మిక ఆహారం అందుతోంది, ఈ ప్రవాహం ఆపవద్దుఅని చెప్పారు.

సాధనచేయాలి, తరించాలి అనే తలంపు నీకువస్తూఉంటే అదికూడా గురువు అనుగ్రహమే. సాధనచేయాలనే తలంపురావటం, సాధనచేయటం, ఆవస్తువును పొందటంఅంతా గురువుఅనుగ్రహమే. ఇదిఅంతా గురువుఅనుగ్రహమేఅని నీకు ఎప్పడు తెలుస్తుందిఅంటే నీవుసాధనచేసి ఆ గురువును ఆత్మగా అనుభవంలోనికి తెచ్చుకొన్నప్పడు అది నీకు తెలుస్తుంది. ఉన్నది ఈశ్వరుడే. మన తెలివిఎంత? మన సాధన ఎంత? మీరు ఎంతసాధనచేసారుఅని అడుగుతూఉంటారు. మేము చేసింది ఏమీలేదు, వచ్చిందిఅంతా అటువైపునుండే వచ్చింది. ఒకవేళనేను ఏసాధన చేయలేనని ఈవిధంగా అనుగ్రహించాడేమో ఆయన. చక్కటి గాలివీస్తూఉంటే ఫానుతోపనిలేదు, విసినకర్రతోపనిలేదు. అలాగే దైవానుగ్రహం నీమీద వర్షిస్తూఉంటే నీప్రయత్నంతోపనిలేదు నీవు పొందవలసింది ఏదోపొందుతావు. జ్ఞాని నాస్వరూపాన్ని పొందుతాడు. జ్ఞానికి నాకు బేధంలేదు, జ్ఞానికి పెట్టే నమస్కారం నాకుఅందుతుంది అని భగవంతుడుచెప్పాడు. జ్ఞాని గుణాతీతుడు. ఆయన గుణాలమధ్య ఉన్నాదాని తాలుక రియాక్షన్ ఆయనకు ఏమీఉండదు. గుణాతీతుడుకూడా గుణాలమధ్యలో ఉంటాడు. మనం నవ్వుతూఉంటే ఆయనా నవ్వుతాడు, మనం బాధపడుతూఉంటే ఆయనా బాధపడతాడుకాని ఆ గుణాలతాలుక వేగంవలన ఆయన ఏమీ డిస్టర్బ్ అవ్వడు. ఇతరులు ఎవరైనా నిన్ను ద్వేషిస్తూఉంటే మీరుకూడా వారిని ద్వేషిస్తున్నారుఅనుకో మీకు ఆత్మానుభవం ఎలా కలుగుతుంది, స్వర్గరాజ్యం ఎలాఅందుతుంది. నీవు ఆత్మానుభవం పొందాలంటే సామాన్య మానవుడిలా ప్రవర్తించకు. ఇతరులు నిన్ను ద్వేషిస్తున్నా తిరిగి వారిని ప్రేమించు. ద్వేషం, ద్వేషంతో చల్లారదు. ద్వేషం ప్రేమతో చల్లారుతుంది. ద్వేషకారణం ఉన్నప్పటికి నీవు ద్వేషరహితంగాఉంటే అప్పడు ఈశ్వరుడు ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు. చెట్టు మొదలులో నీరుపోస్తే అది ఆకులకు, కొమ్మలకు చెట్టులోని అన్నిభాగాలకు అందుతుంది. అలాగే నీవు ఈశ్వరభావనతోపనిచేస్తే అదిలోకానికి అంతా అందుతుంది ఎందుచేతనంటే లోకానికి ఆధారమై ఉన్నవాడు ఈశ్వరుడే. నీవు ఆత్మవైఉండి, ఆత్మగా పనిచేస్తున్నావనుకో నీ సహాయసహకారములు మొత్తం సృష్టికి అంతా అందుతాయి. ఎందుచేతనంటే ఈసృష్టిరూపంలో ఉన్నది ఆత్మే, ఈశ్వరుడే. నీవు ఆత్మజ్ఞానం సముపార్జిస్తే ఇతరులు ఎవరిద్వారా అందని సహాయసహకారములు నీద్వారా లోకానికి అందుతాయి.

**ఈ జాగ్రదవస్థ కూడా ఒక స్వప్నమే. స్వప్నం నిద్రలో గాని రాదు. అనగా ఈ జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలు మూడూ ఒక నిద్రలో అంతర్భాగాలు. జననమరణాలు కూడా నిద్రలోనివే. మెలకువ ఆ నిద్రలోంచి కలగాలి.**

**- భగవాన్ శ్రీ రమణమహర్షి**

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు

| | | | |
|---|---|---|---|
| 24-03-02 | ఆదివారం | చిలుకూరు వయా భీమవరం | |
| 27-03-02 | బుధవారం | చించినాడ | గీతా మందిరం |
| 28-03-02 | గురువారం | చించినాడ | గీతా మందిరం |
| 05-04-02 | మంగళవారం | జిన్నూరు | శ్రీ రమణక్షేత్రం |
| 13-04-02 | బుధవారం | సామర్లకోట | విమల్ బాట్లింగ్ కంపెనీ |

**ఓం శ్రీ సద్గురుభ్యో నమః**

సర్వగురు స్వరూపమ్
సర్వశక్తి సమన్వితమ్
సర్వ మంగళ దాయకమ్
శ్రీ నాన్న సద్గురుం నమామి

శరణం శ్రీ నాన్న దేవ మీ
చరణ మె నాకు శరణం ॥ శరణం ॥
నేను నేననెడి శ్రీరమణుల
దివ్య బోధల సారమా ॥ శరణం ॥


నేను నెననెడి తలంపును
నేరుగ నేర్వగ తెలిపెడి మీ
అమృత బోధల పలుకు పలుకున
వెలుగు వెలిగెడి సద్గురు దేవా ॥ శరణం ॥

శ్రీరామకృష్ణుల భక్తి పుంజమా
శ్రీ రమణ సద్గురుల జ్ఞానతేజమా
భరత శుక వామదేవుల వైరాగ్యమా
భక్త జన జనక నాన్న గురుదేవా ॥ శరణం ॥

**ఒక భక్తురాలు**
**విజయనగరం**

# శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామివారి దేవస్థానం

## పాలకొల్లు



శివ భక్తాగ్రేసరులకు మా ప్రణామములు !

ది. 25-02-1979వ సంవత్సరం నుండి 18 అడుగుల వెడల్పు 360 మూరలుగల పాగా పాలకొల్లు శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామివారికి మరియు పార్వతీ అమ్మవారికి మరియు నందీశ్వరునకు పుట్టింటివారైన దగ్గులూరు వా॥లు కీ॥శే॥ వరదా సోమలింగంగారి కుమార్డు సోమేశ్వరరావు గారు వారి సతీమణి మాణిక్యం గార్లకు గురుతుల్యులైన కీ॥శే॥ అందే వీరన్న గారు వారి సతీమణి వీరభద్రమ్మ గార్లచేత స్వీకరించబడిన వార్షికంతో భక్తిగా తయారుచేయబడిన పాగ మహాశివరాత్రికి అనగా ది. 12-03-2002 మంగళవారం రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలమందు శ్రీ స్వామివారికి 24వ వార్షికోత్సవ సందర్భముగా సమర్పించుకొనుటకు ట్రస్టుబోర్డు వారు ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగారు పాగాకు అనుమతి ఇచ్చియున్నారు. ఇదే ప్రకారం శ్రీశైలములో జరుగుతుంది.